# సర్దుబాటు

రేషనలైజేషన్‌తో పంచాయతీ సిబ్బంది సర్దుబాటుకు చర్యలు

సీనియార్టీకి అనుగుణంగా జాబితా సిద్ధం

దగ్గర ప్లేస్‌మెంట్ కోసం పైరవీలకు తెరలేపిన ఆశావహులు

తలలు పట్టుకుంటున్న యంత్రాంగం..



డీపీఓ కార్యాలయం (ఫైల్)

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 26:** జిల్లా పంచాయతీలో రేషనలైజేషన్ ద్వారా సిబ్బంది సర్దుబాటుకు చర్యలు ప్రారంభం అయ్యాయి. నిబంధనల మేరకు సీనియార్టీ జాబితా ఇప్పటికే సిద్ధం చేసినట్లు డీపీఓ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. అయితే దగ్గర ప్లేస్‌మెంట్ కోసం ఇప్పటికే ఆశావహులు పైరవీలకు తెరలేపారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల సిఫార్సు లేఖలతో కార్యాలయం చుట్టూ ఆశావహులు ప్రదక్షిణ చేస్తుండటంతో డీపీఓ కార్యాలయ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇంకా సర్దుబాటు ప్రక్రియే ప్రారంభం కాలేదు. ఇప్పటి నుంచే ఇలా చేస్తే ఎలా అంటూ వాపోతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే ఇక్కడ డిజిటల్ అసిస్టెంట్‌తో పాటు పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5, విలేజ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ ఇలా ప్రతి సచివాలంలోనూ 11 మంది ఉండేలా చర్యలు చేపట్టారు. కొన్ని సచి వాలయాల్లో 13 మంది వరకు ఉంటున్నారు. కొన్ని సచివాలయాల్లో 6 నుండి 8 మందే ఉండటం లాంటి పరిస్థితులున్నాయి. అయితే రేషనలైజేషన్‌లో భాగంగా ప్రతి సచివాలయానికి ఓ సెక్రటరీ ఉండేలా, సచివాలయ సిబ్బంది 8మందికి తక్కువ కాకుండా ఉండే లా డీడీఓ చర్యలు చేపట్టనున్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేయ డానికి ఉమ్మడి జిల్లా డీపీఓలు ఇద్దరు అనంతపురం డీపీఓ కార్యాలయంలోనే మకాం వేసి లోటుపాట్లకు తావులేకుండా తగిన చర్యలు చేపట్టడంలో నిమగ్నం అయ్యారు.

### ప్రతి సచివాలయానికి ఓ సెక్రెటరీ ఉండేలా చర్యలు



రేషనలైజేషనల్‌లో భాగంగా ప్రతి సచివాలయానికి ఓ సెక్రటరీ ఉండేలా తగిన చర్యలు చేపడుతున్నాం. సెక్రటరీలు లేని ప్రాంతంలో విలేజ్ అసిస్టెంట్స్‌ను నియమించి, సమస్యలు తలెత్తకుండా నిబంధనల మేరకు రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం. డీపీఓ కార్యాలయం నుంచి డీడీఓలు ఎందరన్నది గుర్తించడం జరుగు తోంది. అక్కడ సిబ్బందిని సీనియార్టికి అనుగుణంగా సర్దుబాటు చేస్తాం.

\- ప్రభాకర్‌రావు, డీపీఓ

## అమరావతికి ద్విసభ్య కమిటీ సభ్యులు

**బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 26:** తెలుగుదేశం శింగనమల నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యులకు పార్టీ అధిష్టానం నుంచి పిలుపువచ్చింది. అమరావతిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిముడుగు కేశవరెడ్డి మంగళవారం భేటీ అవుతారని తెలిసింది. పార్టీ అభ్యర్థిగా బండారు శ్రావణిని ప్రకటించిన నేపథ్యంలో ద్విసభ్య కమిటీలో కొంత అసంతృప్తి నెలకొంది. వారి వర్గీయులు పార్టీ జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత నుంచి వారికి పిలుపు వచ్చింది.

# జగన్‌ను సాగనంపుదాం

## అనంత అంటే కాంగ్రెస్‌కు ఎంతో ఇష్టం

ఏపీలో బలమైన నాయకుడు వైఎస్సార్

ఆయన ఆశయ సాధన షర్మిలతోనే సాధ్యం

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

అనంతలో కాంగ్రెస్ 'న్యాయ సాధన సభ'





మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే

25 ఎంపీ సీట్లు ఇస్తే.. ఢిల్లీ మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్కసారైనా కేంద్రాన్ని ఈ విషయమై అడిగారా..?

- మాట తప్పి, మడమ తిప్పిన జగన్‌ను ఇంటికి సాగనంపుదాం..

- మద్యాన్ని సంపూర్ణంగా నిషేధిస్తామన్నారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగనని అన్నారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని జగన్ ఓట్లు అడుగుతున్నారు..?

- వైఎస్సార్ ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తామన్నారు..? ఒక్కటైనా పూర్తి అయ్యిందా..?

పోలవరం సహా రాష్ట్ర హక్కుల గురించి ప్రధాని మోదీని ఒక్కసారైనా ప్రశ్నించారా..? బీజేపీకి మోకరిల్లుతున్నారేగాని.. నిలదీసే సాహసం చేయడం లేదు.

(వివరాలు 7లో..)

'న్యాయ సాధన సభ'లో కాంగ్రెస్ అగ్రనాయకులు

## రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన

**గుత్తి, ఫిబ్రవరి 26:** రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి అభినందనీ యమని వక్తలు పేర్కొన్నారు. అమృత్ భారత్ స్కీంలో భాగంగా గుత్తి రైల్వే జంక్షన్‌ను రూ.10కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. స్థానిక రైల్వే అధికారులు బుకింగ్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు వివిధ పాఠశాల విద్యార్థులు, స్థానిక ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధు సూదన్‌గుప్త, బీజేపీ, టీడీపీ నాయకులు హాజరయ్యారు. ముందుగా విద్యార్థుల చే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గుత్తి రైల్వే అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని వారు స్టేజీమీద ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజనీర్ సంజీవ్‌కుమార్, స్థానిక డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ రమేష్, స్టేషన్ మేనేజరు సురేష్‌బాబు, ఐఓడబ్ల్యు నాగేశ్వర నాయక్, బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ మీనాకుమారి, సీఐ వెంకట రామిరెడ్డి, రైల్వే ఐపీఎఫ్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.


గుత్తిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

## మా నాయనకోసం ప్రచారం చేయండి..!

● అధికారుల సంగతి నేను చూసుకుంటా..! ● యానిమేటర్లకు విశ్వ తనయుడి కర్తవ్య బోధ



'అధికారుల సంగతి నేను చూసుకుంటా. మీరు ఎన్నికల్లో మా నాయన కోసం పనిచేయండి. ఈ 45 రోజులు ఏ సమావేశం జరిగినా మహిళలను తరలించే బాధ్యత మీదే.' అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్ రెడ్డి యానిమేటర్లకు కర్తవ్య బోధ చేశారు. ప్రభుత్వపరంగా ఏ హోదా లేకపోయినా.. వారితో సమావేశం నిర్వహించారు. ఏకంగా ఉరవకొండలోని వైసీపీ కార్యాలయంలోనే వైకేపీ యానిమేటర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. 'అందరూ సెల్‌ఫోన్లను బయటపెట్టి లోపలికి రండి..' అని ముందుగానే సూచించారు. ఆ తరువాత అసలు పనిని మొదలు పెట్టారు. 'సిద్ధం సభ, ఆసరా మీటింగ్‌లకు జనాలు ఎట్ల వస్తున్నారో చూశారుకదా..? రాబోయేది వైసీపీ ప్రభుత్వమే..' అని యానిమేటర్లను బెదిరించారు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ సభలు, సమావేశాలకు మహిళలను తరలించే బాధ్యత మీదే అని వారికి హుకుం జారీ చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ చేర్చాలని సూచించారు. 'పార్టీ కోసం పనిచేసేందుకు మేం సిద్ధమే. కానీ అధికారులు మా మీద పని ఒత్తిడి పెడుతున్నారు' అని కొందరు అధికార పార్టీ విధేయులు ప్రణయ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ విషయం తాను చూసుకుంటానని 'భరోసా' ఇచ్చారు యువనాయకులవారు. 'ఆయనేమైనా అధికారా..? ప్రజా ప్రతినిధా..? ఇలా పార్టీ కార్యాలయానికి పిలిపించి.. రాజకీయ ప్రచారం చేయమనం ఏమిటి..?' అని కాస్త పద్ధతిగా ఉండేవారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వ్యవహారం చూస్తుంటే.. ఎన్నికలు పూర్తయ్యేవరకూ పొదుపు మహిళలకు ఇబ్బందులు తప్పేలా లేవని కొందరు వ్యాఖ్యానించారు. - గుంతకల్లు

# అటకెక్కించారు..!

ప్రత్యేక బృందం ఉత్తిదేనా...?

పట్టుకోకపోతే పక్కా పోలీసుల వైఫల్యమే

అధికారపార్టీ నేతల ఒత్తిడితోనేనా?

జైలుకెళ్లకుండా బెయిల్ కోసం వైసీపీ గూండాల యత్నం

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి కేసులో తదుపరి చర్యలేవీ...?


శ్రీకృష్ణపై దాడి దృశ్యాలు

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 26:** ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి కేసును పోలీసులు అటకెక్కిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నెల 18న వైసీపీ సిద్ధం సభలో శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేశాయి. ఈ ఘటనలో కూడేరు మండలం మరుట్ల- 2వ కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని అరెస్ట్ చేసి, రాచమర్యాదలతో రిమాండ్‌కు పంపారు. జైలులో కూడా అతడికి ఎంతటి ఘనమైన సౌకర్యాలు కల్పిస్తున్నారోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన వారిలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని దొడగట్టకు చెందిన గొల్ల అశోక్, కళ్యాణదుర్గం మండలంలోని బోయలపల్లికి చెందిన కురుబ నాగేంద్ర, కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన బండి రవి వైసీపీ నాయకుల వద్ద తలదాచుకుంటున్నారని సమాచారం. వెతకాల్సిన చోట కాకుండా.. ఏదో ఓ చోట తిరిగి.. ఆచూకీలేదని చెబుతూ, పోలీసులు చేతులెత్తేస్తున్నారు. ఘటన జరిగి పది రోజులు అవుతున్నా అధికార పార్టీ రౌడీలను పోలీసులు పట్టుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వారిని అరెస్ట్ చేయలేదంటే అది పోలీసుల వైఫల్యమేనని పలువురు పేర్కొంటున్నారు.

### ప్రత్యేక బృందం ఉత్తిదేనా ?

శ్రీకృష్ణపై దాడికి సంబంధించి రౌడీలను పట్టుకోవడానికి వెళ్లిన ప్రత్యేక బృందం ఎక్కడ తిరుగుతోంది? అనే అంశం ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది. దాడికి పాల్పడిన వారిని పట్టుకునేందుకు ఒక ప్రత్యేక బృందం గాలిస్తోందని ఇటీవల జిల్లా పోలీసు అధికారులు ప్రకటించారు. కరడుగట్టిన నేరస్థులు, భారీ దొంగతనాల్లో ఆరితేరిన వారిని పట్టుకోవడానికి ఎస్ఓజీ బృందాన్ని పంపుతుంటారు. స్పెషల్ బ్రాంచ్ బృందానికి సమాచార సేకరణకే సమయం సరిపోతోంది. ప్రస్తుతం ఈ రెండు బృందాలకు ఒక అధికారే నేతృత్వం వహిస్తున్నారు. ఆ విభాగాలకు చెందిన బృందాలు దుండగులను పట్టుకోవడానికి వెళ్లినట్లు కనిపించడం లేదు. గత కొన్ని రోజులుగా అరెస్టులు లేకపోవడం చూస్తుంటే ఏ ప్రత్యేక బృందం ఉన్నట్లు కనిపించడం లేదు. అంతా తూచ్ అనిపిస్తోంది. ఇక రాప్తాడు స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ) కొంతవరకు కేసు గురించి ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఆయనకు కనగానపల్లి, కళ్యాణదుర్గం పోలీస్‌స్టేషన్ల నుంచి సహకారం కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాప్తాడు సీఐ సీఎం బందోబస్తుకు వెళ్లారు. ఈ క్రమంలో ఆ కేసు విచారణ గురించి పోలీసు శాఖలో పట్టించుకునేవారే కనిపించడం లేదు.

### ముందస్తు బెయిల్ కోసం యత్నాలు

ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన రౌడీలు జైలుకెళ్లే పరిస్థితే లేదని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. దాడికి పాల్పడిన దుండగులు జైలుకు వెళ్లకుండా ఉండేందుకు తమ నాయకుల అండతో యాంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దాడి చేసి సిగ్గులేకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఓ వ్యక్తి యాంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మరో ఇద్దరు అదేకోవలోనే వ్యవహారం నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఆ ముగ్గురూ అదే కోణంలో బెయిల్ తెచ్చుకుంటే జిల్లా పోలీస్‌శాఖకే సిగ్గుచేటని పలువురు విమర్శిస్తున్నారు.

### వదిలేసినట్లేనా..?

ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి సంబంధించిన వీడియోలో కొత్త ముఖాలను గుర్తు పట్టి, పట్టుకోవాల్సిన బాధ్యత పోలీసులదే. కానీ వారిని గుర్తించడం దేవుడెరుగు... ఇప్పటి వరకూ జనం గుర్తించి, సమాచారం ఇచ్చినవారిని కూడా పట్టుకోవడం లేదు. పూర్తి ఆధారాలు ఉన్నా.. వారిని పట్టుకోవాలన్న ఆలోచనే చేయడం లేదు. దాడిలో పాల్గొన్నవారికి అధికార వైసీపీ కీలక నేతల మద్దతు ఉందని స్పష్టంగా తెలుస్తోంది. పోలీసులపై ఎలాంటి ఒత్తిళ్లు లేవని పైకి చెబుతున్నా, ఒకరు మినహా.. అరెస్టులు లేకపోవడం ఒత్తిళ్లు ఉన్నాయనేందుకు నిదర్శనం. ఇంత దారుణమైన దాడి జరిగినా జిల్లా పోలీసు అధికారులు తేలిగ్గా తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. వారు స్పందించకపోతే ఎన్నికల సమయంలో మీడియా ప్రతినిధులపై మరిన్ని దాడులు తప్పవన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమౌతోంది. ఇక అరెస్టులు ఉండవని, ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు సాగుతున్నాయని అధికార పార్టీవారు బాహాటంగా చెబుతున్నారు.

# కుప్పలు తెప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు

సిద్ధం సభ, వాహనాల పార్కింగ్ పొలాల్లో దర్శనం

వైసీపీ నాయకులు తొలగిస్తారా..?

మేమే తొలగించుకోవాలా..?

అయోమయంలో రైతులు


వాహనాల పార్కింగ్ స్థలం వద్ద పడివున్న మద్యం సీసాలు

**రాప్తాడు, ఫిబ్రవరి 26:** ఇటీవల మండలకేంద్రమైన రాప్తాడు వద్ద వైసీపీ నిర్వహించి న సిద్ధం సభా ప్రాంగణమంతా ఇప్పటికీ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు, వైసీపీ జెండా లు కుప్పలు, కుప్పలుగా కనిపిస్తున్నాయి. సభకు వచ్చిన వాహనాలను పార్కింగ్ చేసిన పొలాల్లోనూ తాగేసిన వాటర్ పాకెట్లు, మద్యం సీసాలు, గ్లాసులు తదితర వ్యర్థాలు దర్శన మిస్తున్నాయి. ఈనెల 18న రాప్తాడు పరిసరాల్లో ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో సిద్ధం సభ నిర్వహించారు. ఈ సభకు అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల ద్వారా ప్రజలు రాప్తాడుకు తరలివచ్చారు. సభ ముగి సింది. స్టేజ్, బ్యారికేడ్లు, ఇతర సామాగ్రి మొత్తం తొలగించారు. కానీ సభ జరిపిన పొలా ల్లో జనం తాగేసిన వాటర్ పాకెట్లు, బాటిళ్లు, మజ్జిగ పాకెట్లు, వైసీపీ జెండాలు, జెండాల కర్రలు, ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా పడి ఉన్నాయి. అలాగే పలు జిల్లాల నుంచి వచ్చిన వాహనాలను జాతీయరహదారికి ఇరువైపులా పొలాల్లో పార్కింగ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన బస్సుల్లోనే బిర్యానీ పాకెట్లు, బిర్యానీ డబ్బాలు, వాటర్ పాకెట్లు, వాటర్ బాటి ళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్లు, కర్ణాటక, ఆంధ్ర మద్యం తీసుకొచ్చారు. ఆ బస్సుల్లో వచ్చిన జనం వాహనాలను పార్కింగ్ చేసిన పొలాల్లోనే బిర్యానీ తిని, మద్యం తాగారు. ఖాళీ మద్యం సీసాలు, టెట్రా ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, బిర్యానీ డబ్బాలు, బి ర్యానీ పార్శిల్ కవర్లను పొలాల్లోనే పడేయడంతో... అవి పొలాల నిండా విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. సిద్ధం సభకు, వాహనాల పార్కింగ్‌కు భూములిచ్చిన రైతులేమో పొలా ల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను వైసీపీ నాయకులు తీసేయిస్తారా లేదా తామే తొలగించుకో వాలా అనే అయోమయంలో పడ్డారు. పొలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తామే తొలగిస్తామని సభ నిర్వహించే మునుపు వైసీపీ నాయకులు తెలిపారని, కానీ సభ ముగిసి వారం రోజులు గడిచినా తొలగించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సభ నిర్వహించిన పొలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, వైసీపీ జెండాలు

## జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యానికి హానికరం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 26:** వైసీపీ ప్రభుత్వం నేరస్థుల కొమ్ము కాస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాప్తాడులో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను వైసీపీ మూకలు చుట్టుముట్టి దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. దాడిలో శ్రీకృష్ణ దారుణంగా గాయపడి హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఘటన జరిగి పదిరోజులు కావస్తున్నా వైసీపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపే జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యానికి హానికరమని, జర్నలిస్టులకే భద్రత లేకుంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడికి పాల్పడినవారు ప్రజలందరూ గమనించేలా తిరుగుతున్నారని, అధికార పార్టీ నాయకుల చెంతచేరి సవాలు విసురుతున్నారని అన్నారు. అయినా పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా, ఒక్కరిని మాత్రమే నామమాత్రంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఇది పోలీసుల చేతగానితనంగా కనిపిస్తోందని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు చొరవ చూపి మిగిలిన నేరస్థులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## దాడి చేసినోళ్లకు డిన్నర్లు ఇస్తున్నారా..?

శ్రీకృష్ణపై దాడి దృశ్యాలను చూస్తే రక్తం మరుగుతోంది

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 26:** 'రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అంతమంది దుర్మార్గంగా దాడి చేస్తే.. కేవలం ఒకరిని అరెస్టు చేశారు. మిగిలిన వారికి ఎమ్మెల్యేల ఇళ్లలో విందు భోజనాలు పెడుతున్నారా..? పోలీసులే వారి ఇళ్లలో డిన్నర్లు ఇస్తున్నారా...?' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకృష్ణపై దాడి దృశ్యాలను చూస్తే రక్తం మరుగుతోందని అన్నారు. శ్రీకృష్ణపై దాడి చేసినవారిలో ఇప్పటివరకూ ఆరుగురిపై కేసులు పెట్టి.. ఒకరిని మాత్రమే అరెస్టు చేశారని విమర్శించారు. పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారని, వారికి ఖాకీ దుస్తులు అవసరం లేదని, వైసీపీ డ్రెస్సులు వేసుకుని తిరగాలని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం పోతుందని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. జర్నలిస్టులకు ఎలాగూ రక్షణ ఇవ్వరు, కనీసం అరెస్టు చేయడానికి చేతులు రావడం లేదా అని ప్రశ్నించారు. విలేకరులపై దాడి.. ప్రజాస్వామ్యం జరిగిన దాడి అని అన్నారు. జర్నలిస్టులపై జరిగిన దాడుల గురించి వైసీపీ నాయకుడు కొడాలి నాని వ్యాఖ్యలు దారుణమని అన్నారు. సీఎం జగన్ ప్రజలకు మామూలు భాషలో చెప్పాలనుకుంటే సజ్జలతో మాట్లాడిస్తాడని, బూతు భాషలో చెప్పాలనుకుంటే నిపుణుడైన కొడాలి నానితో చెప్పిస్తాడని చురకలంటించారు. మీడియాపై దాడి ప్రజాస్వామ్యానికి చేటని, అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు ఖండించాలని కోరారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

# జగన్‌ను సాగనంపుదాం

- అనంత అంటే కాంగ్రెస్‌కు ఎంతో ఇష్టం
- ఏపీలో బలమైన నాయకుడు వైఎస్సార్
- ఆయన ఆశయ సాధన షర్మిలతోనే సాధ్యం
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- అనంతలో కాంగ్రెస్ 'న్యాయ సాధన సభ'



ఐక్యత చాటుతున్న కాంగ్రెస్, వామపక్ష నాయకులు



మాట్లాడుతున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 26:** మాట తప్పి, మడమ తిప్పిన సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపుదామని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెద్దామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని న్యూటౌన్ జూనియర్ కళాశాల మైదానంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 'న్యాయ సాధన సభ'లో ఆయన ప్రసంగించారు. అంతకు మునుపు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో కలిసి 'ప్రతి నెలా ప్రతి కుటుంబానికి రూ.5 వేలు' లోగోను ఆవిష్కరించారు. అనంతపురం అంటే ఇందిరా గాంధీ సహా కాంగ్రెస్ కీలక నాయకులందరికీ మహా ఇష్టమని, ఇక్కడి నుంచి ఇద్దరు ప్రధానులను, వైఎస్సార్ లాంటి బలమైన నాయకుడిని ఇచ్చారని అన్నారు. రాష్ట్ర హక్కుల కోసం ప్రధానులను వైఎస్సార్ నేరుగా కలిసేవారని, మోదీ ప్రధాని అయిన తరువాత చంద్రబాబు, జగన్ అలా ఎన్నిసార్లు కలిశారని ప్రశ్నించారు. స్వప్రయోజనాల కోసం అడపాదడపా కలిసింది తప్ప.. రాష్ట్రం కోసం ఒక్కసారీ కలిసింది లేదని విమర్శించారు. రాష్ట్ర హక్కుల గురించి గొంతు విప్పి చెప్పుకోలేని పరిస్థితుల్లో ఆ రెండు పార్టీలు ఉన్నాయని విమర్శించారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని.. వీరిలో ఏ ఒక్కరికి ఓటు వేసినా అది బీజేపీ ఖాతాలోకే చేరుతుందని అన్నారు. అందుకే ఇండియా కూటమిని బలపరచాలని కోరారు. వైఎస్సార్ ఆశయ సాధన షర్మిలతోనే సాధ్యమని, ఆయన వారసురాలిగా షర్మిల రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు కాంగ్రెస్‌లోకి వచ్చారని అన్నారు. స్థానిక నాయకులు ఆమెకు సహకారం అందించాలని కోరారు. పదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి లేదని, పరిశ్రమలు, ఉద్యోగాలు లేవని అన్నారు. ఐదేళ్లు చంద్రబాబు, మరో ఐదేళ్లు జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు.

### ఐదేళ్లు నిద్రపోయారా..?



అధికారంలోకి వస్తే ఏటా మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ అన్నారని, ఐదేళ్లు కుంభకర్ణుడిలా నిద్రపోయి, ఎన్నికల సమయంలో దగా డీఎస్సీని విడుదల చేశారని సీఎం జగన్‌పై షర్మిల మండిపడ్డారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని వైఎస్సార్ వారసురాలిగా పోరాటానికి దిగిన తనను అరెస్టు చేసి ఈడ్చుకెళతారా అని నిలదీశారు. సాగునీటి ప్రాజెక్టులు, మద్యపాన నిషేధం వంటి హామీల విషయంలో మాట తప్పిన మీరా వైఎస్సార్ వారసులు అని జగన్‌ను ప్రశ్నించారు. చెల్లెలు అన్న కనీస మర్యాద లేకుండా జగన్ అండ్ టీం తనను దూషిస్తోందని అన్నారు. '3,200 కి.మీ. పాదయాత్ర చేసి వైసీపీని నిలబెట్టింది ఎవరు..? బాబును అధికారంనుంచి దించింది ఎవరు? నేను కాదా?' అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్ర హక్కులను సాధించుకునే వరకూ ఇక్కడే ఉంటానని, పోరాటం చేస్తానని ఆమె అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని వైఎస్సార్ చెప్పిన మాటను గుర్తు చేశారు. కాంగ్రెస్ చెప్పిన మాట నిలుపుకునే పార్టీ అని, ఇందిరమ్మ రాజ్యం రావాలి... ఇంటింటికి రూ.5 వేలు అందాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదిరమ్మ అభయ హస్తం కింద ప్రతి మహిళకు ఏడాదికి రూ.60 వేలు అందిస్తామని అన్నారు.

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

### నాశనం చేసేశారు..



ప్రధాని మోదీ, సీఎం జగన్ దేశాన్ని, రాష్ట్రాన్ని నాశనం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. నియంతను తలపించేలా పోలీసుల రాజ్యం నడిపిస్తున్నారని విమర్శించారు. వారు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాలు విసిరారు. దేశాన్ని రూ.156 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని అన్నారు. 'రైతులు ఢిల్లీకొస్తే రోడ్లల్లో మేకులు పెడతారా..? రైతులను కాల్చి చంపుతారా..? బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం..' అని విమర్శించారు. అంబానీ, ఆదానీ ఆస్తులను పెంచుతూ ఊడిగం చేస్తూ.. మూడోసారి అధికారం కావాలని అడుగుతున్నారని చేస్తున్నారని మండిపడ్డారు.

-సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

### సోనియా చలించిపోయారు..



'2004 ఎన్నికలకు ముందు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర అనంతరం అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీని ఇక్కడికి పిలిపించాం. అప్పటి కరువు పరిస్థితులను చూసి ఆమె చలించిపోయారు. వలసలను అరికడతామని మర్రాదులో హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు..' అని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. ఏడు లక్షల మంది వలస వెళతారని, వారిని ఆపడం సాధ్యమా అని అప్పట్లో తానే సందేహించానని అన్నారు. ప్రధాని పదవిని సైతం త్యాగం చేసి, మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేసి, ఆయన ద్వారా ఉపాధిహామీ పథకాన్ని తెచ్చారని గుర్తు చేశారు. బండ్లపల్లిలో మొదలైన ఈ పథకం.. నేటికీ కొనసాగుతోందని అన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులే ఉన్నాయని, అందుకే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని పిలిపించి వాగ్దానం చేయించామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చిన వెంటనే మరోసారి ఇక్కడికి పిలిపించి, ప్రతి కుటుంబానికి రూ.5 వేలు పథకం అమలుకు శ్రీకారం చుడతామని అన్నారు.

- రఘువీరారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు

### ఇండియా కూటమిని బలపర్చాలి...



బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ ఇండియా కూటమిని బలపరచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ ఒక్కొక్కటిగా ఇండియా కూటమిలో చేరుతున్నాయని, బలాన్ని పెంచుతున్నాయని అన్నారు. ఇండియా కూటమి బలంగా ఉంటేనే దేశం బాగుపడుతుందని అన్నారు. బీజేపీని గద్దె దింపాలంటే ఇండియా కూటమిని మద్దతు తెలపాలని కోరారు.

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రావు

## మెప్మా ఆర్పీలతో నీకేంపని ?

- మెట్టుకు కాలవ ప్రశ్న



ఆర్పీలతో సమావేశం నిర్వహిస్తున్న మెట్టు

**రాయదుర్గం, ఫిబ్రవరి 26:** వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సోమవారం అతడి ఇంటి వద్ద మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించడాన్ని టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తప్పుపట్టారు. ఏ హోదాతో మెట్టు ఆర్పీలను తన ఇంటికి పిలుపించుకుంటారని ఒక ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. రాయదుర్గం పట్టణంలో మెప్మా విభాగం లో సేవలందిస్తున్న ఆర్పీలను బలవంతంగా మెట్టు ఇంటికి పిలిపించుకున్నారని ఆరోపించారు. అతడికి పార్టీ పదవి తప్ప ప్రభుత్వంలో ఎలాంటి అధికారిక హోదా లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాం టి సమావేశాలు నిర్వహించడం అధికార దుర్వినియోగమే అవుతుందన్నారు. దీన్ని తాము ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతామన్నారు.

## వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి

**కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 26:** వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు సన్న లింగప్ప (55)గ్రామ సమీపంలో ఉన్న కప్పలకుంట చెరువులో కట్టెలు కొడుతుండగా తీవ్రమైన ఎండకు కుప్పకూలిపోయాడు. ఆయన కుమారుడు మాంతేష్ తన తండ్రిని ఇంటికి పిలుచుకురావడానికి వెళ్లాడు. అప్పటికే చేతులు, కాళ్ల మీద బొబ్బలు వచ్చి అపస్మారక స్థితిలో పడి ఉన్న లింగప్పను గుర్తించాడు. వెంటనే ఆటోలో బ్రహ్మసముద్రం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కొల్లక్క, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



శివానంద(ఫైల్)

**పామిడి, ఫిబ్రవరి 26:** దేవర సంబరంతో సందడిలో ఉన్న ఆ కుటుంబం ఒక్కసారిగా శకసంద్రంలో మునిగిపోయింది. కూరగాయలు తెచ్చేందుకు వెళ్లిన ఆ ఇంట్లోని యువకుడిని కారు రూపంలో మృత్యువు కబళించింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కూరగాయలు తీసుకొని ద్విచక్ర వాహనంలో వరుసకు సోదరులైన తలారి శివానంద(20), సురేష్ ఇంటికి తిరిగి వస్తుండగా కారు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గజరాంపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని నీలూరు గ్రామానికి చెందిన తిరుపాలు ఇంట్లో మంగళవారం దేవర కార్యక్రమం ఉంది. ఇందుకు అవసరమైన కూరగాయలు తీసుకువచ్చేందుకు తిరుపాలు కుమారుడు సురేష్ వరుసకు సోదరుడైన జీ కొట్టాలకు చెందిన తలారి శివానందతో కలిసి గుత్తికి వెళ్లారు. కూరగాయలు తీసుకొని ద్విచక్ర వాహనంపై నీలూరుకు బయలుదేరారు. మండలంలోని గజరాంపల్లి గ్రామ సమీపాన ఉన్న ఓ పాల్ డైరీ వద్దకు రాగానే కర్నూలు నుంచి అనంతపురం వెళ్తున్న కారు వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో శివానంద, సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 వాహనంలో క్షతగాత్రులను హుటాహుటిన పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే శివానంద అప్పటికే మృతి చెందినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రుడు సురేష్‌ను మెరుగైన చికిత్సకు అనంతపురం తరలించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ మృతదేహానికి నివాళులర్పించి తండ్రి బసయ్యను ఓదార్చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకొని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు నాగరత్న, బసయ్య ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**ఢీకొట్టి ఉడాయించి.. దబాయింపు:** మండలంలోని గజరాంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ప్రమాదం జరగగానే కారుతో ఉడాయించాడు. ఆ కారు వెనుకనే హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తున్న మరో కారులోని ప్రయాణికులు ఈ ఘటనను గమనించారు. వారు అప్రమత్తమై ఎలాగైనా పట్టుకోవాలని ఆ కారును వెంబడించారు. ఆ కారును నిలిపేందుకు ప్రయత్నించిన వారినే నిందితుడు దబాయించాడు. దీంతో పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసి పోలీసుల సహకారంతో ప్రమాదానికి కారణమైన నిందితున్ని అదుపులోకి తీసుకొని పామిడి పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.



ఆస్పత్రి వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

## పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 26:** రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతుధరల చట్టం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. భారత రైతులకు, కార్మికులకు నష్టదాయకంగా ఉన్న డబ్ల్యూటీఓ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ సోమవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ... రైతులు పండించే పంటలకు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతుధరల చట్టం చేయాలన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2021లో మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక రైతు ఉద్యమం సందర్భంగా రైతాంగానికి ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మరోసారి పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రైతులు ఈనెల 13 నుంచి ఢిల్లీలో ఉద్యమం చేపట్టారన్నారు. అయితే రైతుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, చర్చించి పరిష్కరించేదిశగా కాకుండా వారిని ఢిల్లీకి చేరుకోకుండా బీజేపీ నేతృత్వంలో రోడ్లపై ఇనుప మేకులు కొట్టి, భారీ సిమెంటు దిమ్మెలతో బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. ఢిల్లీవైపు వస్తున్న రైతులను అడుకునేందుకు శత్రు దేశ సైనికులపై చేసినట్లు భారత రైతాంగంపై కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రకటించిందని మండిపడ్డారు. పంజాబ్‌కు చెందిన యువరైతు శుభ్‌కరణ్ సింగ్ ఈ దాడుల్లో మరణించాడని, 25 మందికి పైగా గాయపడ్డారన్నారు. ఇప్పటికే ముగ్గురు రైతులు గుండెపోటుతో మరణించగా అనేకమంది తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. రైతులపై బీజేపీ చేస్తున్న దుర్మార్గపు దాడిని ఖండిస్తూ, పంటలకు మద్దతు ధరలు అమలు చేయవద్దని భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న డబ్ల్యూటీఓ సమావేశాలను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్ర ధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేకర్‌రెడ్డి, వెంకటనారాయణ, ముత్తుజ, రాజేష్‌గౌడ్, కృష్ణుడు, శ్రీనివాసు లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, ఏటీఎం నాగరాజు, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.




గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

## జడ్పీ డిప్యూటీ సీఈఓపై విచారణ...!

- జీతం, అలవెన్సులు డ్రా చేయడంపై ఫిర్యాదులు
- విచారించాలని కలెక్టర్‌కు పీఆర్ కమిషనర్ ఆదేశం

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 26:** జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ లలితా బాయిపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు. గత ఏడాది జూన్, జులై నెలల్లో నిబంధనలకు విరుద్ధంగా జీతం, ఇతర అలవెన్సులు డ్రా చేయడంపై పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆమెపై విచారణ చేయాలంటూ..జిల్లా కలెక్టర్‌కు పీఆర్ కమిషనర్ సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది జడ్పీకి డిప్యూటీ సీఈఓగా లలితాబాయిని నియమించారు. అయితే ఆమె చేరికపై అప్పట్లో పెద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తనను చేర్చుకోలేదంటూ.. ఆమె అప్పట్లో పలుమార్లు పీఆర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో అనూహ్యంగా అప్పట్లో డిప్యూటీ సీఈఓగా అమృత్‌రాజ్‌ను పనిచేస్తున్న మరో అధికారిని సస్పెండ్ చేశారు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించడంతో....వెంటనే ఆయనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఈఓగా ఉన్న అధికారి రిలీవ్ కాకుండానే... కొత్తగా వచ్చిన లలితా బాయి విధుల్లో చేరడం, బాధ్యతలు తీసుకోవడంపై పెద్ద దుమారం రేగింది. ఆమె విధుల్లో జూన్ 10న చేరారని, 2023 జూన్, జులై నెలల్లో జీతం, ఇతర అలవెన్సులు డ్రా చేయడంపై అనేక విమర్శలు వచ్చాయి. విధుల్లో చేరిన తేదీలు, జీతాలు, ఇతర అలవెన్సులు డ్రా చేసిన వాటికి పొంతన లేకపోవడంపై అనేక ఆరోపణలూ వచ్చాయి. అయితే ఆమె అధికార దుర్వినియోగానికి పాల్పడి జీతాలు, అలవెన్సులు డ్రా చేశారంటూ... తాజాగా ఇటీవల కర్నూలు జిల్లాకు చెందిన రమేష్ అనే వ్యక్తి పూర్తిస్థాయి సాక్ష్యాధారాలతో పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెపై వి చారణ చేయాలంటూ.. ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.



డిప్యూటీ సీఈఓ లలితా బాయి(ఫైల్)

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 37 మందికి గాయాలు

- బొలెరో బోల్తా పడి 30 మంది కూలీలు
- ఆటో బోల్తా... ఏడుగురు ఉపాధ్యాయినులు

**ఉరవకొండ, ఫిబ్రవరి 26:** ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 37 మంది గాయపడ్డారు. ఉరవకొండ పట్టణ శివారులోని గుంతకల్లు రహదారిలో కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం టైర్ పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో 30 మంది కూలీలు గాయపడ్డారు. వజ్రకరూరుకు చెందిన 45 మంది కూలీలు విడపనకల్లు మండలంలోని పాల్తూరుకు మిరప పంటను కోసేందుకు బొలెరో వాహనంలో బయలు దేరారు. ఉరవకొండ సమీపంలోకి వాహనం రాగానే, టైర్ పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో 30 మంది గాయపడ్డారు. గాయపడిన వారంతా వాహనాల కోసం రోడ్డుపైనే ఎదురు చూశారు. 108 వాహనానికి ఫోన్ చేసి గంట అయినా రాలేదని క్షతగ్రాతులు ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన కూలీలను స్థానికులు ప్రైవేట్ వాహనాల్లో ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. సీఐ తిమ్మయ్య యాదవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన వారిలో జ్యోతి, మరియమ్మ, సునీత, కృప, భాగ్యమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ వన్నూరుస్వామితో పాటు మరో 25మంది స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



ఉరవకొండ వద్ద బోల్తాపడిన బొలెరో వాహనం



ప్రమాదంలో గాయపడిన కూలీలు

**ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే**

రోడ్డు ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, టీడీపీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్లను కోరారు. వజ్రకరూరు టీడీపీ నాయకులు నూతేటి వెంకటేశులు, దస్తగిరి, ఛాయాపురం నాగభూషణ గాయపడిన వారిని పరామర్శించారు. దగ్గరుండి వారికి అవసరమైన ఏర్పాట్లను చేశారు.

**కూలీలంతా సేఫ్..**

**అనంతపురం టౌన్:** పాల్తూరు వద్ద ప్రమాదానికి గురై చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చిన కూలీలందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఆర్ఎంఓ హేమలత తెలిపారు. మొత్తం 18మంది కూలీలను మెరుగైన చికిత్సకోసం జిల్లా ఆస్పత్రికి తెచ్చారన్నారు. వీరిలో ఇద్దరికికాళ్లు విరిగాయని మిగిలినవారిలో చిన్నచిన్న గాయాలు అయ్యాయని ఎవరికీ ప్రాణాపాయం లేదన్నారు.

**ఆటో బోల్తా పడి..**

విడపనకల్లు: మండలంలోని ఉండబండ గ్రామం వద్ద ఆటో బోల్తా పడి ఏడుగురు ఉపాధ్యాయినులు గాయపడిన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. పాల్తూరు గ్రామంలోని ఇందిరా నగర్ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ఉపాధ్యాయినులు ఉరవకొండ నుంచి పాల్తూరుకు ఆటోలో ఉదయం బయలు దేరారు. ఉండబండ కాలువ వద్ద ఆటో రాడ్ కట్ కావటంతో పల్టీకొట్టింది. ఇందులోని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆటో బోల్తా పడిన వెంటనే పొలాల్లో పనులు చేస్తున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని ఆటోలో ఇరుక్కున్న వారిని బయటకు తీసి ఉరవకొండకు తరలించారు. గాయ పడిన వారిలో సి. రాధ, ఎ. శైలజ, ఎల్. కవిత, ఎస్. ఈశ్వరి, ఎస్. గౌతమి, హేమలతమ్మ, లక్ష్మీకళ ఉన్నారు.



ఉండబండ వద్ద బోల్తా పడిన ఆటో

## నేడు వైద్య ఉద్యోగులకు ప్రత్యేక స్పందన

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 26:** ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం మంగళవారం ప్రత్యేక స్పందన ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులలో జీతాలు సమస్యలు ఉన్నా వ్యక్తిగతంగా ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నా నేరుగా కలిసి వినతి రూపంలో తెలపవచ్చన్నారు. ఇక్కడ అందిన వినతులను రాష్ట్రశాఖకు పంపుతామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఆత్మహత్యకు కారకులైన ఇద్దరికి జైలు శిక్ష

**అనంతపురం క్రైం,ఫిబ్రవరి 26:** ఒకరి ఆత్మహత్యకు కారకులైన ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా పడింది. గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి కృష్ణారెడ్డి, కొత్తపల్లి చలమావతిలకు మూడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.10వేలు జరిమానా విధిస్తూ ఇదివరకే అనంతపురం పీఎఎస్‌జే కోర్టు న్యాయాధికారి వెలువరించిన తీర్పును జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సోమవారం ఖరారు చేశారు. పెనకచెర్ల గ్రామానికి చెందిన పి.ఉమాదేవి, ఆమె భర్త రవిశంకర్‌లు కొత్తపల్లి కృష్ణారెడ్డి, మరికొందరితో మాట్లాడి తమకున్న ఇంటిని రూ.2.70లక్షలకు రిజిస్టర్ ఆయకం చేయించారు. ఈ విషయంలో రవిశంకర్ ఇల్లును విడిపించుకోమని కొత్తపల్లి కృష్ణారెడ్డితో పాటు మిగితా ఈ కేసులోని నిందితులు రవిశంకర్‌పై బలవంతం చేశారు. దీంతో రవిశంకర్ పురుగుల మందు తాగి మృతిచెందాడు. ఈ ఘటనపై 2015 డిసెంబరు 22న గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును సమగ్రంగా విచారించిన అనంతపురం పీఎఎస్‌జే కోర్టు న్యాయాధికారి ఇదివరకే ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. దీనిపై జిల్లా కోర్టుకు అప్పీలుకు వెళ్లగా సమగ్రంగా విచారించిన జిల్లా న్యాయాధికారి పీఎఎస్‌జే కోర్టు న్యాయాధికారి వెలువరించిన తీర్పునే ఖరారు చేశారు. పీపీ హరినాథరెడ్డి తదితరులను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

## 3న ప్యాట్-2023 పరీక్షలు

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 26:** ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్(పీఏటీ-2023) పరీక్షలు వచ్చే నెల 3వ తేదీ జరుగుతాయని డీఈఓ వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని తిరుపతి, రాజమండ్రిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారన్నారు. అనంతపురం నుంచి వెళ్లే అభ్యర్థులు ఎవరైనా పరీక్షా కేంద్రాల వద్ద గంట ముందుగానే ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

# మీ తప్పులకు.. మేమా బాధ్యులం..?

## పాలకవర్గం, అధికారుల తీరుపై వాల్వ్ ఆపరేటర్ల అసహనం

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 26:** 'మీరు చేసిన పాపానికి ప్రజలతో మేం తిట్లు తినాల్సి వస్తోంది. ఆ తప్పులకు మమ్మల్ని దొంగలుగా చూపించకండి.. కనీసం మోటర్లను మరమ్మతు చేయించలేని దుస్థితిలో ఉన్నారా..' అంటూ అధికారులపై నగరంలోని వాల్వ్ ఆపరేటర్లు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నగరపాలికలో నిర్వహించిన స్పందనలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు ఆధ్వర్యంలో వాల్ ఆపరేటర్లు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్‌లో అనేక ఏళ్లుగా నగరంలో తాగు నీటి సరఫరా విభాగంలో వాల్వ్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నామన్నారు. నగరానికి ఒక్క మోటరుతో నీటిని అందించడం చాలా కష్టమన్నారు. తాగునీరు సరఫరా కాకపోవడంలో ప్రజలు మమ్మల్ని తిడుతున్నారని వాపోయారు. కొన్ని రోజులుగా ఇబ్బంది పడుతుంటే మోటర్లను ఎందుకు రిపేరు చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రజలకు పాలక వర్గం, అధికారులే సమాధానం చెప్పాలని, తమను దొంగలుగా చూపించవద్దని అన్నారు. ట్యాంకులు నిండకుండా వాల్వ్ ఆపరేటర్లు పనిచేయలేదనే మాట సరికాదన్నారు. నీరు అందించకపోతే ప్రజల పక్షాన నిలిచి ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయుడు, ఓబుళపతి, మురళిమోహన్, పోతులయ్య పాల్గొన్నారు.



స్పందనలో వినతిపత్రం అందజేస్తున్న వాల్వ్ ఆపరేటర్లు

# అనంత కరువు రైతు కష్టాలు పట్టవా..?

## టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 26:** కరువు జిల్లా అనంత రైతులను వదిలేసి కుప్పంకు కృష్ణాజలాలు ఏ విధంగా తరలిస్తారని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య ప్రశ్నించారు. సోమవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో నీరులేక పంటలు ఎండిపోతున్నా జిల్లాకు చెందిన అధికార పార్టీ మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు నోరుమెదపకపోవడం శోచనీయమన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో కరువు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ సారి ఆయకట్టుకు సాగునీరు అందించకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారన్నారు. అనేక మంది రైతులు తమ పొలాలను బీడుగా పెట్టుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. 2023-24 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావంతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించకుండా జాప్యం చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా కరువు జిల్లా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఓబుళపతి, పెద్దన్న, నారాయణస్వామి, బ్యాళ్ల రాము పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆవుల కృష్ణయ్య

# వైసీపీ అరాచకాలు అడ్డుకోరా..?

- పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించరా...!
- అధికారుల తీరుపై ఎమ్మార్పీఎస్ నేత బీసీఆర్ దాస్ ఆగ్రహం
- 'స్పందన'లో అధికారుల ఎదుటే పురుగుల మందు తాగే యత్నం

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 26:** దళితులకు ఇచ్చిన ఇంటిస్థలాలను వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బీసీఆర్ దాస్ స్పందన కార్యక్రమంలోనే పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అనంతపురంరూరల్ మండలం కురుగుంట పొలం సర్వే నంబర్ 41-1, 41-3,41-3బీలో ఉన్న సీలింగ్ భూమిని 2010లో నాటి కలెక్టరు దళితుల ఇళ్లనిర్మాణాలకు స్థలాలను కేటాయించి పట్టాలు ఇచ్చారు. వివిధ కారణాలతో పట్టాలు పొందిన దళితులు అక్కడ ఇళ్లు కట్టుకోలేదు. దీంతో వైసీపీ నాయకులు ఆ స్థలాన్ని అధికారుల సాయంతో కబ్జా చేయడానికి కుట్ర పన్నారు. ఆ కబ్జాను అడ్డుకోవాలని, ఆ స్థలాలను దళితులకే చెందేలా చర్యలు తీసుకోవాలని ఐదు నెలలుగా దాస్, బాధితులు కలెక్టరు, జేసీ, డీఆర్‌ఓ, ఆర్డీఓ, తహసీల్దార్‌లను కలిసి వినతి పత్రాలిచ్చారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో అధికారుల ఎదుటే దాస్ పురుగుల మందు తాగడానికి యత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు దానిని అడ్డుకోడానికి యత్నించగా.. మందు దాస్ ముఖం, శరీరంపై పడింది. వెంటనే పోలీసులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. దాస్‌కు ప్రాణాప్రాయం లేదని వైద్యులు తెలిపారు.



స్పందనలో పురుగుల మందు తాగడానికి యత్నిస్తున్న దాస్

### దాస్‌కు పలువురి పరామర్శ

**అనంతపురం అర్బన్:** స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మార్పీఎస్ నేత బీసీఆర్ దాస్‌ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు హరిభూషణ్, మూర్తి, కుమార్, నరేష్ పాల్గొన్నారు. అలాగే దాస్‌ను మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఫోన్‌లో పరామర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే తిరిగి దళితులకు సంబంధించిన 300 పట్టాలను అందజేస్తామని హామీ ఇచ్చారు.

## హంస వాహనంపై కొండమీదరాయుడు

**బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 26:** బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం శ్రీ కొండమీదరాయుడు హంసవాహనంపై విహరించారు. 11 రోజుల పాటు సాగిన ఈ బ్రహోత్సవాల్లో.. స్వామి వారికి ప్రతి రోజూ ఒక్కో వాహన సేవ నిర్వహించారు. స్వామివారి బ్రహోత్సవాలు చివరి రోజు కావడంతో భక్తులు పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి వారిని దర్శించుకున్నారు. ఇంతటితో బ్రహోత్సవాలు ముగిసినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

## జడ్పీలో వాగ్వాదం

**అనంతపురం విద్య, ఫిబ్రవరి 26:** జడ్పీలో ఓ జడ్పీటీసీ, కాంట్రాక్టర్‌కు డిప్యూటీ సీఈఓకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సోమవారం జడ్పీ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో అధికార పార్టీకి చెందిన జడ్పీటీసీ భూతరాజు, ఓ కాంట్రాక్టర్‌కు డిప్యూటీ సీఈఓ లలితా బాయికి మధ్య సోమవారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఓ పనికి సంబంధించిన ఫైల్‌ను డిప్యూటీ సీఈఓ వద్దనే ఉంచుకోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. దీంతో వారిద్దరూ సీఈఓ నిదియా దేవి చాంబర్‌కు వెళ్లి.. అక్కడకూడా గట్టిగా వాదనకు దిగారు. దీంతో సీఈఓ 'నా రూం నుంచి బయటకు వెళ్లండి, కాల్ ద పోలీస్' అంటూ మండిపడినట్లు సమాచారం.

## ఎస్వీఐటీలో వర్క్‌షాప్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

**రాప్తాడు, ఫిబ్రవరి 26:** మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల సీఎస్‌ఈ విభాగంలో ఎమెర్జింగ్ టెక్నిక్స్ అండ్ టూల్స్ ఇన్ సాఫ్ట్వేర్ టెస్టింగ్ అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. దీన్ని ప్రారంభించిన కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకో వడానికి ఈ వర్క్ షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ రమాకాంత్‌రెడ్డి, ఛైర్మన్ క్రిష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ రవీంద్రరెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపల్ విష్ణువర్దన్, సీఎస్‌ఈ విభాగాదిపతి బాలాజీ పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం

**చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 26:** చెన్నేకొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ వేధాంత్ సేకావత్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ తులసీదాస్, చీఫ్ టికెట్ ఇన్ స్పెక్టర్ శ్రీరామ్, ఐఓడబ్ల్యూ సతీశ్, జడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, ట్రైనీ డీఎస్పీ పృథ్వీతేజ, సీఐ శివాంజనేయులు, జడ్పీటీసీ గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి, సర్పంచ్ దనశ్రీ, హెచ్‌ఎం ఓబుళమ్మ పాల్గొన్నారు. కాగా, ఎర్రంపల్లి రైల్వేస్టేషన్ పునరుద్ధరించాలని ఆ గ్రామస్థులు వేదాంత్ సేకావత్‌కు వినతిపత్రం అందించారు.

## పీజీ వైద్య విద్యార్థికి గోల్డ్‌మెడల్

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 26:** అనంత వైద్య కళాశాలకు చెందిన పీజీ వైద్య విద్యార్థి హర్షిత ఎప్లయిడ్ ఎపిడమియోలజీ కోర్సులో జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి.. గోల్డ్‌మెడల్ సాధించింది. జాతీయ కుటుంబ సంక్షేమ సంస్థ డైరెక్టర్ హెల్త్ జనరల్ అజిత్ గోయల్ ఆమెకు బంగారు పతకాన్ని ఢిల్లీలో అందజేశారు. సోమవారం నగరానికి వచ్చిన హర్షితను ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఇతర ఉద్యోగులు అభినందించారు.

## గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

**అనంతపురం న్యూటౌన్:** స్థానిక మిస్సమ్మ కాలనీ సమీపంలో అల్లాబకాష్ షెడ్‌ను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఇంటికి వాడాల్సిన సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లకు గ్యాస్ నింపి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఏడు సిలిండర్లను సీజ్ చేశారు. వెయింగ్ మిషన్‌తో పాటు రీఫిల్లింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ జయపాల్‌రెడ్డి, సీఎస్‌డీటీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## పల్స్ పోలియోపై సమావేశం

**గార్లదిన్నె:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పల్స్ పోలియోపై సోమవారం సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మంజుల మాట్లాడుతూ.. పల్స్ పోలియో విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఇందులో ఎంపీడీఓ ఆఫీస్, ఏఓ బాబాఫక్రుద్దీన్, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరయ్య, పీహెచ్‌ఎం అరుణ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సహకార బ్యాంకు ఉద్యోగుల సంఘం సభ్యురాలిగా సునీత



**అనంతపురం క్లాక్‌టవర్:** హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఆల్ ఇండియా కో ఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ 8వ జాతీయ మహాసభలో జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో కార్యవర్గసభ్యురాలిగా జిల్లాకు చెందిన సునీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# అధికారులు లేని వేళ.. తెరుచుకున్న రికార్డుల గది

**అనంతపురంరూరల్, ఫిబ్రవరి 26:** అధికారులు విజయవాడకు వెళ్లిన నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూం తలుపులను సిబ్బంది తెరవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి బదిలీ పై వచ్చిన తహసీల్దార్ సూచనల మేరకు గతకొన్ని రోజులుగా తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూం మూసేశారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో కావడంతో రికార్డు గదిలో పని ఉండదని.. ఆ గదికి తలుపులు మూసేశారు. ఎన్నికల శిక్షణ నేపథ్యంలో ఆదివారం ఆ అధికారులు విజయవాడకు వెళ్లారు. ఈ క్రమంలో ఆ రికార్డు రూం తలుపులు తెరుచున్నాయి. అధికారులు లేనిసమయంలో రికార్డు రూం తెరవడం పలు విమర్శలకు తావిస్తోంది. కొంత మంది సిబ్బంది రికార్డులు తారుమారు చేశారనే ఆరోపణలున్నాయి.



రికార్డు రూం తలుపులు తెరచిన దృశ్యం

# ఎన్నికల్లో లబ్ధి కోసమే అనంత శంకుస్థాపనలు

## 56 నెలలు ఎమ్మెల్యే ఏం చేశారో..?: జనసేన

**అనంతపురం ప్రెస్‌క్లబ్ / రూరల్, ఫిబ్రవరి 26 :** ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శంకుస్థాపనల హడావుడి చేస్తున్నారని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. సోమవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ కాలనీలో పర్యటించి మహిళలతో సమస్యలు అడిగి తెలుసు కున్నారు. పెండ్యాల శ్రీలత మాట్లాడుతూ... గడిచిన 56 నెలలుగా ఎమ్మెల్యే అనంతవెంకరామిరెడ్డి అభివృద్ధిని గాలికొదిలేసి తీరా ఎన్నికల సమయంలో ప్రజలు మోసం చేయడానికి శంకుస్థాపనలు చేస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎంపీగా.. ప్రస్తుతం ఎమ్మెల్యేగా అభివృద్ధి ఏమీ చేయలేకపోయాడని మండిపడ్డారు. కేవలం ప్రజలను మరోసారి మోసం చేసి.. గెలవడానికి చూస్తున్నారని ధ్వజమెత్తారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీలకు ఓటేసి ఆశీర్వదించాలన్నారు.

### విజయానికి సమష్టిగా పనిచేద్దాం: జనసేన

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా సమష్టిగా పనిచేద్దామని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన డివిజన్‌స్థాయి నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన, టీడీపీ ఉమ్మడి కార్యచరణతో ముందుకెళ్లాలన్నారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొని వారికి అన్ని విధాలుగా జనసేన అండగా ఉంటుందని భరోసా కల్పించాలన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతి నాయకుడు సైనికుడిలా పనిచేసి జనసేన, టీడీపీ ప్రభుత్వ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా కార్యదర్శులు ముప్పూరి కృష్ణ, కిరణ్‌కుమార్, అవుకు విజయ్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శి హుస్సేన్ పాల్గొన్నారు.



మహిళలతో సమస్యలు తెలుసుకుంటున్న పెండ్యాల శ్రీలత

## స్వయం ఉపాధి కోర్సుల్లో మహిళలకు శిక్షణ

**అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 26:** గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే కోర్సుల్లో మార్చి 18 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. గ్రామీణ నిరుద్యోగ 30 రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తామని, 19-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ మహిళలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కలిగి ఉమ్మడి జిల్లా వాసులై ఉండాలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08554-255925, 94409 05479, 96188 76060ను సంప్రదించాలని కోరారు.

### ప్రథమ చికిత్సపై ....

ప్రాథమిక చికిత్సపై మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సుంకర రమేష్ తెలిపారు. ఈ శిక్షణ పొందిన వారికి న్యూఢిల్లీ సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. త్వరలో ప్రారంభించే ఈ శిక్షణకు సంబంధించి మరిన్ని వివరాలకు 75699 79322, 93909 82098ను సంప్రదించాలని కోరారు.

## రేపు ఉద్యోగమేళా

**అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 26:** స్థానిక కోర్టు రోడ్డులోని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో బుధవారం ఉదయం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి సోమవారం తెలిపారు. అపోలో ఫార్మసి, వెర్షన్ ఇన్‌ఫోకామ్ ప్రైవేట్ సంస్థల్లో పనిచేసేందుకు పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఫార్మసిస్ట్, ఫార్మసి అసిస్టెంట్, రీటైల్ ట్రైనీ, టెక్నికల్ ఆపరేటర్‌గా ఎంపికైన వారికి రూ.14వేల నుంచి రూ.18వేల వరకు నెల వేతనం ఇస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బుధవారం నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

## పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలి

**శింగనమల, ఫిబ్రవరి 26:** పంటలకు కనీసం మద్దతు ధరలు చట్టం చూయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం శింగనమలలో రైతులు, కార్మికుల సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. రైతులు పండిస్తున్న అన్ని పంటలకు కనీసం మద్దతు ధరలు చట్టం కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని, విద్యుత్ రంగంలో కార్పొరేట్లకు అనూకూలంగా ఉన్న సంస్కరణలు నిలిపివేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుంకన్న, రామకృష్ణ, కుళ్లాయప్ప, కొండారెడ్డి, శ్రీనివాసులు, శ్రీనా, రమేష్ పాల్గొన్నారు.

## టీడీపీతోనే ఉపాధి, ఉద్యోగాలు

**ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 26:** టీడీపీతోనే యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని టీడీపీ గెలుపునకు యువత కృషి చేయాలని కనగానపల్లి మండల తెలుగు యువత మండల అధ్యక్షుడు బట్టాసురేష్‌చౌదరి అన్నారు. సోమవారం కనగానపల్లిలో తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాప్తాడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పరిటాల సునీతను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు.

## వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 26:** రొద్దం మండలం ఆర్ లోచర్లలో 200 ఎకరాల్లో ఈత చెట్లను కొట్టేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఈడిగ సాధికార సమితి సభ్యుడు గోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాత, ముత్తాతల కాలం నుంచి 200 ఎకరాల్లో ఈత చెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు తీరని అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాల్లో ఈత చెట్లను కొట్టేస్తే నాన్‌బెయిలబుల్ అరెస్టు అమలులో ఉందన్నారు. ఈత చెట్లను కొట్టేసిన వైసీపీ నాయకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేదంటే సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని అన్నారు.

## ఢిల్లీ రైతుల ఆందోళనకు మద్దతు

**అనంతపురం క్లాక్‌టవర్:** ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా సోమవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఢిల్లీ సరిహద్దులో ప్రాంతంలో రైతులు చేస్తున్న శాంతియుత ఆందోళనలో పోలీసులు కాల్పులు జరపడంతో ముగ్గురు రైతులు మరణించడం బాధారమన్నారు. పోలీసులు దమనకాండను ఖండిస్తున్నామని తెలిపారు. ఢిల్లీ రైతుల పోరాటానికి పూర్తి సంఘీభావం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతుకూలీల సంఘం నాయకులు దస్తగిరి, ఏఐఎఫ్‌టీయూ నాయకులు నాగభూషణం, సుధాకర్, స్త్రీవిముక్తి సంఘటన అధ్యక్షురాలు మల్లేశ్వరి, పీడీఎస్‌ఓ మల్లేశ్వరి, రమ్య పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠకు శ్రీకారం

**అనంతపురం కల్చరల్ :** నగరంలోని పీటీసీలో నిర్మించిన కామితార్థ మహాగణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఆలయ ఆవరణంలో గంగపూజ, గోపూజ, గణపతి పూజ, నాందిపూజ, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం నిర్వహించారు. అనంతరం కలశస్థాపన, నవగ్రహ హోమాలు, వాస్తు, దీక్షా హోమాలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో బేల్దారి మృతి

**రాప్తాడు, ఫిబ్రవరి 26:** మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన బేల్దారి సాకే నల్లప్ప (32) విద్యుదాఘాతంతో సోమవారం మరణించారు. బుక్కచెర్లకు చెందిన సాకే లక్ష్మయ్య కుమారుడు నల్లప్ప బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. బుక్కచెర్లలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి సోమవారం ఉదయం నీళ్లు పట్టేందుకు మోటారు ఆన్ చేస్తుండగా.. విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. నల్లప్పకు భార్య ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

## మహిళ ఆత్మహత్య

**గార్లదిన్నె, ఫిబ్రవరి 26:** మండలంలోని పాతకల్లూరు గ్రామానికి చెందిన పూజిత (21) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎగువపల్లికి చెందిన దేవేంద్ర, పార్వతి కుమార్తె పూజితను నాలుగు నెలలు క్రితం పాతకల్లూరు చెందిన మల్లికార్జున, ఈశ్వరమ్మ కుమారుడు లోకేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరు వ్యవసాయం పనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పూజిత పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

## అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తా: అమిలినేని



**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 26:** కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలను అందరినీ కలుపుకొని ముందుకు వెళతానని ఆ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు చంద్రబాబు, నారాలోకేశ్, అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి జర్నలిస్టు క్రికెట్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్, పాల్గొన్న మాంచో ఫెర్రర్ తదితరులు

**అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 26:** స్టేట్ జర్నలిస్టు యూనిటీ క్రికెట్ కప్-2024 పోటీలను సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో కర్నూలుపై అనకాపల్లి జట్టు, బద్వేలుపై రాజంపేట జట్టు విజయం సాధించాయి. వైజాగ్ సిటీ జట్టుపై శ్రీసత్యసాయి జిల్లా జట్టు గెలుపొందింది. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## గాయపడిన కూలీలను ఆదుకోవాలి

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 26:** ఉరవకొండ వద్ద వాహనం బోల్తాపడి గాయపడిన 40 మంది కూలీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం పరామర్శించిన ఆయన మాట్లాడారు. గాయపడిన ప్రతిఒక్కరికీ రూ.5లక్షలు చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరారు. గ్రామీణ ఉపాధి పనులకు కేంద్రం నిధుల కోత విధిస్తే వాటిని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆయన వెంట సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప, నాయకులు ప్రకాష్, వలి, బాబు, సరేష్, జీవ, రాజు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు, రాంభూపాల్

## చీనీకాయలు టన్ను రూ.19 వేలు

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 26:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.19 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 159 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

# బాబు వస్తేనే ఉద్యోగాలు

**రాప్తాడు, ఫిబ్రవరి 26:** రానున్న ఎన్నికల్లో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి రాజధాని, పరిశ్రమలు, యువతకు ఉద్యోగాలు వస్తాయని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి.. టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయంలో ఏ ఒక్క గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. కనీసం గ్రామాలకు నిధులు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనుంజయ. నరసింహులుడు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

## 'జిల్లా స్పందన'కు 287 అర్జీలు

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 26:** కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందనకు 287 అర్జీలు వచ్చాయి. వాటిని జేసీ కేతన్‌గార్గ్, జడ్పీసీఈఓ వైభోమ్‌నిదియా, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టరు ఆనంద్, ఆర్డీఓ గ్రంది వెంకటేష్ బాధితుల నుంచి స్వీకరించారు.

### ఉపాధి ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలి

**అనంతపురం క్లాక్‌టవర్ :** సుమారు 18 ఏళ్ళుగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలని ఏపీ ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందనలో తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ ఉద్యోగుల జేఏసీ నాయకులు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రంతో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజినేయులు, హనుమంతరెడ్డి మాట్లాడుతూ... ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ గ్రేడ్ ఫిక్సేషన్ చేయాలన్నారు. 23 శాతం పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టీఈలు మార్చాలన్నారు. 2018లో ఎఫ్‌టీఈలుగా మారిన ఉద్యోగులకు సర్వీస్ క్రమబద్ధీకరించాలన్నారు.

### ఇంటి స్థలాలను కాపాడండి

**నార్పల :** నార్పల మేజర్ పంచాయతీలో వైసీపీకి చెందిన కబ్జాదారుల నుంచి తమ ఇంటి స్థలాలను కాపాడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రంగాపురం కుళ్లాయప్ప ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. జగనన్న కాలనీలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వగా కొందరు వైసీపీకి చెందిన చోటా నాయకులు దొంగ పట్టాలు పుట్టించి విక్రయిస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన వారికి ఇంటి పట్టాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్వీ రమణ, మేకలరాజు, జైశ్రీరామ్ పాల్గొన్నారు.

### వైసీపీ నాయకుల కబ్జా అడ్డుకోండి

**ఆత్మకూరు :** మండలంలోని వై కొత్తపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని, దాన్ని ఆపాలని ఆ గ్రామస్థులు, గ్రామ టీడీపీ నాయకులు డిప్యూటీ తహసీల్దారుకు ప్రసాద్, ఎంపీడీఓ దశరథరామయ్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సర్వేనంబరు 174లో కొంత భూమిని గతంలో ప్రజా అవసరాలకు కేటాయించారని, ప్రస్తుతం ఆ స్థలాన్ని కొందరు వైసీపీ నాయకులు ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు వెంకటేసులు, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, ఓబులప్ప, నారాయణ, జయప్ప, సదాశివరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.





నార్పలలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆత్మకూరులో వై కొత్తపల్లి గ్రామస్థులు, టీడీపీ నాయకులు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

## ముగిసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



అలంకరణలో స్వామివారు

**గుత్తి రూరల్, ఫిబ్రవరి 26:** మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. రాత్రి 9గంటలకు స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం వసంతోత్సవంతో స్వామివారి ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ దేవదాసు ఆలయ అర్చకు లు, రవిస్వామి, చేతన్ వర్మ, లికిల్‌వర్మ, నవీన్ ఉదయ్ సిబ్బంది పాల్గొన్నారు.

**హుండీ ఆదాయం రూ.3.60 లక్షలు**

బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో సోమవారం ఇన్‌స్పెక్టర్ పాండురంగారెడ్డి, ఆలయ ఈఓ దేవదాసు ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. రూ.3.63905లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు.

## ఘనంగా భోగేశ్వరుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

**పామిడి, ఫిబ్రవరి 26:** పట్టణంలోని భోగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ సహిత భోగేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈకల్యాణ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం పూర్ణాహుతి చేపట్టారు. ప్రసన్న పార్వతీ సమేతంగా భోగేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణలతో మార్మోగింది. కార్యక్రమంలో పీజేఆర్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానంద రెడ్డి, టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పత్తి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ దేవి విగ్రహం ప్రతిష్ఠ

**విడపనకల్లు, ఫిబ్రవరి 26:** మండలంలోని ఆర్ కొట్టాల గ్రామంలో పెద్దమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయం ముందు హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేశారు.

## బిల్వపత్రికి పూజలు



వేషధారణలో నృత్యం చేస్తున్న శివభక్తుడు

**కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 26:** మున్సిపాల్టీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో బిల్వపత్రి చెట్టుకు లింగాష్టకం పూజ నిర్వహించారు. సోమవారం శివస్వాములు, మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక జలాలను తీసుకుని ఊరేగింపుగా శివాలయానికి చేరుకున్నారు. ఈ ఊరేగింపులో ఓ వ్యక్తి శివుడి ఆకారంలో వేషం ధరించి నృత్యం చేయడం ప్రజలను ఆకట్టుకుంది. ఆ ప్రత్యేక జలాలతో శివుడికి అభిషేకం చేశారు. మండల పూజ కూడా ఎంతో ఘనంగా నిర్వహించారు.

## వైభవంగా ఉత్సవాలు



వేదావతి హగరిలో నరసింహస్వామికి గంగపూజ నిర్వహిస్తున్న దృశ్యం

**గుమ్మఘట్ట, ఫిబ్రవరి 26:** మండలంలోని కలుగోడు గ్రామంలోని అడిగుప్పలో రాజులదేవుని ఉత్సవాలతో పాటు కలుగోడులో నరసింహ స్వామి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కలుగోడులోని నరసింహస్వామికి కర్ణాటకలోని మైలల్లి సమీపంలోని వేదావతి హగరిలో గంగపూజ నిర్వహించారు. రాజుల దేవునికి వేపులపర్తి సమీపంలో వేదావతి హగరిలో గంగపూజ నిర్వహించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

**గుమ్మఘట్ట, ఫిబ్రవరి 26:** మండలంలో వేదావతి హగరి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రాత్రి స్టేషన్ హౌస్ ఆఫీసర్ నరేంద్ర కుమార్ సీజ్ చేశారు. ఇందులో ఒక ట్రాక్టర్‌కు డిప్యూటీ తహసీల్దార్ రూ. మూడువేలు జరిమానా విధించినట్లు తెలిపారు. మరో ట్రాక్టర్‌ను మైన్స్ అండ్ జియాజికల్ అధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కానీ పోలీసులు మామూలు పుచ్చుకుని వదిలేసినట్లు సమాచారం. గత వారంరోజులుగా స్టేషన్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హెడ్ కానిస్టేబుల్ 18 బెల్టుషాపులపైన అక్రమ ఇసుక ట్రాక్టర్లపైన మెరుపుదాడులు చేస్తూ మామూలు పుచ్చుకుని వదిలేస్తున్నట్లు గ్రామాలలో జోరుగా చర్చసాగుతోంది. దీనిపై ఎస్ఐ వెంకటేశ్వర్లు బందోబస్తుకై వెళ్లడంతో పోలీసులు ఇలాంటి అవినీతి, అక్రమాలు మరింత ఎక్కువగా పాల్పడుతున్నట్లు గ్రామాలలో చర్చించుకుంటున్నారు.

## కాంగ్రెస్ సభకు తరలిన నాయకులు

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి26:** జిల్లాకేంద్రంలో సోమవారం కాంగ్రెస్‌పార్టీ చేపట్టిన న్యాయ సాధన సభకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారని ఇన్‌చార్జ్ తెలిపారు.

## శవాన్ని పూడ్చే విషయంలో వివాదం



పోలీసులతో మాట్లాడుతున్న ఓ వర్గం వారు

**పుట్లూరు, ఫిబ్రవరి 26:** మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని పూడ్చనీయకుండా మరో సామాజికవర్గం వారు అడ్డుకున్నారు. దీంతో వారు శవాన్ని తీసుకొని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు గ్రామంలో సర్వే నెంబరు 304లో సుమారు మూడు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో గతంలో సర్వేచేసి హద్దులు వేశారు. ఆదివారం రాత్రి ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఉదయం శవాన్ని తీసుకొని పూడ్చేందుకు వెళ్లగా ఇది తమకు చెందిన పట్టా భూమి అని ఆ సామాజికవర్గ వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు శవాన్ని తీసుకుని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు వెళుతుండగా నార్పల క్రాస్‌లో పోలీసులు అడ్డుకున్నారు. సుమారు అక్కడ గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం గ్రామంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. సంఘటనా స్థలానికి ఆర్డీఓ చేరుకొని ఇరువురితో మాట్లాడారు. సమస్యను పరిష్కరించి శవాన్ని పూడ్చించారు.

# దుర్గం కోటపై టీడీపీ జెండా ఎగరేద్దాం: కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

**రాయదుర్గం, ఫిబ్రవరి 26:** రాయదుర్గం కోటపై తెలుగుదేశం జెండా ఎగరవేసే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని ఉడేగోళం సమీపంలో ఉన్న మద్దానేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో సోమవారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుండి బైక్‌ర్యాలీగా శాంతినగర్, బళ్లారి బస్టాండ్, వినాయకసర్కిల్, లక్ష్మీబజార్, ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్, కోతిగుట్ట మీదుగా మద్దానేశ్వరస్వామి దేవాలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలు బాగుపడాలన్నా, అభివృద్ధి చెందాలన్నా తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఆంధ్రప్రదేశ్ నుండి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. శాసనమండలిలో ఐదు నిమిషాలు కూడా మాట్లాడలేని వ్యక్తి మెట్టు తనకు ప్రత్యర్థిగా ఉండడం సిగ్గుగా ఉందన్నారు. మెట్టు గోవిందరెడ్డి అవినీతి చిట్టాను బయటకు తీస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బీసీసెల్ అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు వెంకటశివుడు యాదవ్, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పోతుల నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, మండల కన్వీనర్ హనుమంతు, వేలూరు మరియప్ప, నేసేపేట నజీర్, మాల్యం యువరాజ్‌గౌడ్, శరభన్‌గౌడ్, కౌన్సిలర్ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్లు పొరాళ్ల పురుషోత్తం, టంకశాల హనుమంతు, బండి భారతి, మండల నాయకులు వీరేష్, గిరిధర్‌నాయుడు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల పరిశుభ్రతకు పెద్దపీట**

టీడీపీ పాలనలో గ్రామాల పరిశుభ్రతకు పెద్దపీట వేశామని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజ్‌లో భాగంగా డీ.హీరేహాళ్ మండల కేంద్రంలో టీడీపీ హయాంలో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ వద్ద సోమవారం ఆయన 46వ సెల్ఫీ దిగారు. మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో సుమారు 26 కిలోమీటర్ల మేర ఈ భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అందులో 16 కిలోమీటర్లు రూ. రెండు కోట్ల వ్యయంతో పూర్తి చేశామని తెలిపారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ మురుగునీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించామ న్నారు. అయితే మిగిలిన 10కిలోమీటర్ల డ్రైనేజీని వైసీపీ ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదని కాలవ ప్రశ్నించారు. పల్లెల అభివృద్ధి పట్ల జగన్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. తెలుగుదేశం పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కాలవ శ్రీనివాసులు తెలిపారు.

**టీడీపీలో 30 కుటుంబాల చేరిక**

రాయదుర్గం మండలంలోని రాయంపల్లి గ్రామానికి చెందిన 30 కుటుంబాల సభ్యులు సోమవారం కాలవ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు కాలవ శ్రీనివాసులు టీడీపీ కండువాలు వేసి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నరసింహులు, సురేంద్ర, రుద్రప్ప, శివశంకర్ తదితరులు ఉన్నారు. వీరితో పాటు 27 కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

**20 కుటుంబాల చేరిక**

**డీ.హీరేహాళ్:** మండలంలోని సిద్దాపురం గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. పట్టణంలోని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఇంటిలో సిద్దాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పలువురు కాలవ శ్రీనివాసులు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కాలవ శ్రీనివాసులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## బాబును కలిశాకే భవిష్యత్ కార్యాచరణ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

**కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 26:** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుని కలిశాకే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని కళ్యాణదుర్గం నియోజకవర్గ పార్టీ నాయకుడు ఉమామహేశ్వరనాయుడు స్పష్టం చేశారు. పట్టణానికి ఉమామహేశ్వరనాయుడు వచ్చాడన్న విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులు భారీ ఎత్తున సోమవారం ఆయన క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా టిక్కెట్ దక్కకపోవడంతో అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ ఆవేదనను, ఆక్రోశాన్ని వెల్లగక్కారు. అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులను సముదాయించిన ఉమామహేశ్వరనాయుడు ఈ విషయాన్ని పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్తు కార్యాచరణ మీ అందరి ఆలోచనలకు అనుగుణంగా ప్రకటిస్తానని వారికి నచ్చజెప్పారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి వేలాది మంది ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

## అందరినీ కలుపుకుని ముందుకెళ్తా: అమిలినేని



**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 26:** కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలను అందరినీ కలుపుకొని ముందుకు వెళతానని ఆ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. నగరంలోని రాంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు చంద్రబాబు, నారాలోకేశ్, అచ్చెంనాయుడులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 29 నుంచి తాను కళ్యాణదుర్గంలోనే నివాసం ఉంటూ అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న భావంతోనే క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ఆరు నెలల్లో నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపై విచారణ చేయించి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా చేస్తానన్నారు.

**భారీ మెజార్టీతో గెలుస్తాం**

**ఉరవకొండ:** రానున్న ఎన్నికల్లో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ భారీ మెజార్టీతో గెలువబోతోందని ఆ పార్టీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మండలంలోని ఆమిద్యాల ఆయన స్వగ్రామం కావడంతో సోమవారం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామంలోని ఆంజనేయస్వామి, శివాలయం, అక్కమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు మీద ప్రజలకు ఉన్న నమ్మకమే రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తుందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మారెన్న, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, శ్రీధర్, దబ్బర్ గోపాల్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

## హత్య కేసులో అరెస్టు

**తాడిపత్రి, ఫిబ్రవరి26:** పట్టణంలోని జయనగర్‌కాలనీలో భార్య హరిలతను హత్యచేసిన కేసులో భర్త రామాంజనేయులును సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పుట్లూరు మండలం గరుగు చింతలపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు అతని భార్య హరిలతలు కొంతకాలం క్రితం తాడిపత్రికి వచ్చి జయనగర్‌కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు. రామాంజనేయులు గతంలో పెన్నాసిమెంట్ గ్యారేజీలో పని చేసేవాడు. మద్యం, జూదాలకు బానిసై జల్సాలకు అలవాటుపడి విధులపట్ల నిర్లక్ష్యం వహించ డంతో ఉద్యోగం నుంచి తొలగించారు. జల్సాల కోసం స్వగ్రా మంలోని మూడెకరాల చీనీతోటను అన్న కొడుకు రాముకు రూ.17లక్షలకు విక్రయించాడన్నారు. అడ్వాన్స్ కింద రూ.6.50 లక్షలను తీసుకున్నాడ న్నారు. ఈ డబ్బులను జల్సాలకు ఖర్చు పెడతాడన్న ఆలోచనతో కుమార్తె పేరుమీద రూ.5లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని భర్తతో హరిలత గొడవపడిందన్నారు. కోపంతో ఆమె తలపై రోకలిబండతో కొట్టి హత్య చేశాడన్నారు. నిందితున్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామని సీఐ తెలిపారు.

## రేపు వాహనాల వేలం

**కణేకల్లు, ఫిబ్రవరి 26:** కణేకల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈ నెల 28న వేలం వేస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు ముందుగా రూ. మూడు వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**విడపనకల్లు, ఫిబ్రవరి 26:** మండల కేంద్రంలో జువారి కంపెనీ ఆధ్వర్యంలో కిమ్స్ సవీర ఆసుపత్రి వైద్యులు సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 250 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి 20మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి ఆపరేషన్లు చేయించడం కోసం బళ్లారిలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. 200 మందికి పైగా గుండెకు పరీక్షలు నిర్వహించారు. ఈసీజీలు చేయించి గుండె జబ్బులను గుర్తించారు. 300మందికి పైగా వివిధ రకాలు వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. జువారి కంపెనీ డిప్యూటీ మేనేజర్ బీ. విశ్వేశ్, జువారి సిబ్బంది రాజు, ఉమశంకర్, కాశీం, కిమ్స్ సవీర వైద్యులు మధు, రాంకుమార్ పాల్గొన్నారు.

## ఇద్దరు మట్కాబీటర్ల అరెస్ట్

**తాడిపత్రి టౌన్, ఫిబ్రవరి 26:** పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్ వద్ద సోమవారం ఇద్దరు మట్కాబీటర్లను అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.34,470 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ మురళీకృష్ణ తెలిపారు.

## ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి



ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

**గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 26:** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలని, స్టాఫ్, టెక్నీషియన్, పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, మారుతిప్రసాద్, సాకేనాగరాజు, జగ్గలిరమేష్, సునీల్, రామునాయక్, సురేంద్ర, అబ్దుల్లా, మస్తాన్, మోహన్ పాల్గొన్నారు.

## ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష

**తాడిపత్రి, ఫిబ్రవరి26:** పట్టణంలోని విజయనగర్‌కాలనీ, యాడికి మండలంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి జోగిరాజ, షేక్ ఇబ్రహీంలకు సోమవారం తాడిపత్రి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి ఆరునెలల జైలుశిక్ష విధించారు. పోలీసులు తెలిపిన మేరకు అనంతపురానికి చెందిన జోగిరాజ, షేక్ ఇబ్రహీంలు కలిసి తాడిపత్రిలోని విజయనగర్‌కాలనీలో 2023 నవంబరు 11న రామకృష్ణ నాయక్, చెట్టినాయక్ ఇళ్లల్లో 30తులాల వెండి, తులం బంగారం, యాడికి మండలంలోని కుర్మాజీపేట గ్రామంలో శ్రీనివాసులుకు చెందిన ఇంటిలో చొరబడి ఐదు తులాల బంగారాన్ని దొంగిలించారన్నారు. వీరిని అరెస్ట్ చేసిన పోలీసులు కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరిచారన్నారు. విచారణ జరిపిన మేజిస్ట్రేట్ నేరం రుజువు కావడంతో నిందితులకు జైలుశిక్ష విధించారని పోలీసులు తెలిపారు.

## పాత పెన్షన్ విధానాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి

**గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 26:** పాత పెన్షన్ విధానం అమలు హామీని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, వైసీపీ మండల కన్వీనర్ మోహన్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి వాసగిరిమణికంఠ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయితే పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇస్తుందో వారికే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ మద్దతు తెలుపుతామన్నారు. జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, అర్బన్‌శాఖ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి ఎల్లన్న, శంకరయ్య, రూరల్‌శాఖ ప్రధాన కార్యదర్శి కల్పన, వజ్రకరూరు మండల అధ్యక్షుడు పాపన మురళి పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి26:** మండలంలోని బుగ్గసమీపంలో సోమవారం 55సంవత్సరాల వయస్సుగల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. పరిసర ప్రాంతాల్లో విచారించగా మృతుడు యాచక వృత్తి చేస్తూ జీవనం సాగించేవాడని, అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు.

## కళాజాతా ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన

**గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 26:** పట్టణంలోని కసాపురం రోడ్డు మార్కెట్ సర్కిల్‌లో సోమవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాతా ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ కౌన్సిలర్ పీరానాయక్, అనంత పాజిటివ్ నెట్‌వర్క్, ఔట్ రీచ్ వర్కర్ జంగం శ్రీనివాసులు, కళాజాతా సభ్యులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన



శంకుస్థాపనకు హాజరైన రైల్వే, బీజేపీ నాయకులు

**తాడిపత్రి, ఫిబ్రవరి 26:** తాడిపత్రి, జూటూరు రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10.47కోట్లను మంజూరు చేసిందని బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం పలు అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తాడిప త్రి రైల్వేస్టేషన్‌లో వెయిటింగ్ హాలు విస్తరణ, టాయిలెట్ల అభివృద్ధి, లిఫ్ట్ సిస్టం, జూటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం విస్తరణ, మరుగుదొడ్ల అభివృద్ధి తదితర పనుల కోసం రూ.10.47కోట్లను కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు అంకాల్‌రెడ్డి, తాడిపత్రి రైల్వే స్టేషన్‌మాస్టర్ అనిల్, గుత్తి రైల్వే చీఫ్ మేనేజర్ ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## శివమాలధారుల నగర సంకీర్తన



ఊరేగింపులో శివమాలధారులు

**రాయదుర్గం, ఫిబ్రవరి 26:** పట్టణంలో శివమాలధారులు ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శాంతినగర్‌లోని పెద్ద బన్నీ మహంకాళి ఆలయం నుండి శివుడి ఉత్సవమూర్తిని అశ్వ రథంపై కొలువు తీర్చి నగర సంకీర్తన ప్రారంభించారు. వినాయకసర్కిల్ మీదుగా టీచర్స్ కాలనీ ఓంకారేశ్వర ఆలయం వరకు శివ మాలధారులు స్వామి పాటలకు భజనలు, నృత్యాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఓంకారేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## హడావుడిగా రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మెట్టు

**బొమ్మనహాళ్, ఫిబ్రవరి 26:** సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ నాయకులు హడావుడిగా పేదల ఇళ్ల స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం అందజేశారు. రాయదుర్గం వైసీపీ సమన్వయకర్త స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీటిని పంపిణీ చేశారు. వైసీపీ సొంత ఖర్చులతో ఇంటిస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ రమేష్, డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ విజయమ్మలు హాజరయ్యారు. ఈ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎంపీపీ పద్మ, ఎంపీటీసీ నీలవేణి, స్థానిక ఎంపీటీసీ శివశంకరమ్మ డుమ్మా కొట్టారు.

## యువకుడి ఆత్మహత్య

**తాడిపత్రి టౌన్, ఫిబ్రవరి 26:** మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలోని వెంచర్‌లో సోమవారం వెంకటేష్ (20) అలియాస్ మాస్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ పోలీసులు తెలిపారు. ప్రకాశం జిల్లా రుద్రసముద్రం మండలం దనకొండ గ్రామానికి చెందిన వెంకటేష్ ఉపాధి నిమిత్తం తాడిపత్రికి వచ్చాడు. బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసయ్యాడు. రోజుమాదిరిగానే పనులు ముగించుకొని నిద్రించాడు. సోమవారం తెల్లవారేసరికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## డిజిటల్ అసిస్టెంట్లపై వేధింపులు తగవు

**యాడికి, ఫిబ్రవరి26:** సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లపై వేధింపులు తగవని మండలంలోని పలువురు డిజిటల్ అసిస్టెంట్లు సోమవారం ఎంపీడీఓ సావిత్రికి విన్నవించారు. వారు మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయంలోని కొందరు సిబ్బంది తమకు ఇష్టారాజ్యంగా విధులను అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయ పనివేళల్లోనే కాకుండా రాత్రివేళల్లో కూడా విధులను చెబుతూ తమను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారన్నారు. ఏ మండలంలోని లేనివిధంగా తమకు విధులను అప్పగించడం ఏంటని వారు ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్యపై సిబ్బందిని ఆరాతీస్తామని, సచివాలయ సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చేస్తామని ఆమె తెలిపారు.

## సేద్యం పనులు చేస్తూ ఎద్దు మృతి



**బొమ్మనహాళ్, ఫిబ్రవరి 26:** మండలంలోని కొళగానహళ్లి గ్రామంలో సోమవారం సేద్యం పనులు చేస్తూ ఓ ఎద్దు మృతి చెందింది. బాధితుడు తెలిపిన మేరకు రామాంజనేయులు అనే రైతు మూడెకరాల పొలంలో పత్తిపంట సాగు చేసేందుకు సేద్యం పనులు చేస్తున్నాడు. అకస్మాత్తుగా ఎద్దు కుప్పకూలిపోయి మృతి చెందింది. ఆరునెలల కిందట రూ. 1.6 లక్షలు పెట్టి కాడెద్దులు కొనుగోలు చేశానని ఇప్పుడు ఒక ఎద్దు మృతి చెందడంతో రూ. 80 వేలు నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు.

## వైభవంగా రథోత్సవం

**ఉరవకొండ,ఫిబ్రవరి26:** మండలంలోని వెలిగొండ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గురుసిద్ధావధూతల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నంది కోలాటాలతో, గంగా జలాన్ని ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా గురుసిద్ధేశ్వర స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలను చేశారు. ఉత్సవమూర్తులను రథంపై ఉంచి రథాన్ని లాగారు. రథంపైకి భక్తులు అరటి, జామపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

## యువకుడి అదృశ్యం

**యాడికి, ఫిబ్రవరి26:** మండలంలోని రాయలచెరువుకు చెందిన ఆసిఫ్‌రాజా అనే యువకుడు అదృశ్యమైనట్లు ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన 23 ఏళ్ల ఆసిఫ్‌రాజా మదనపల్లిలో బీటెక్ చదువుతున్నాడు. మొదటి, రెండవ సంవత్సరాల్లో కొన్ని సబ్జెక్టులు తప్పిపోవడంతో తల్లిదండ్రులు మందలించారని తెలిపారు. ఈనెల 15న ఇంటి నుంచి వెళ్లిన ఆసిప్‌రాజా తిరిగి రాలేదని తెలిపారు. బంధువులు, స్నేహితుల ఇళ్లవద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## తాగునీటి కోసం ధర్నా

**పెద్దపప్పూరు, ఫిబ్రవరి26:** మండలకేంద్రంలోని సచివాలయం వద్ద సోమవారం తాగునీటి కోసం సీపీఐ, ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. గండికోట నీరు వద్దని, స్వచ్ఛమైన పెన్నానది నీరు కావాలంటూ నినాదాలు చేశారు. ధర్నాలో నాయకులు పురుషోత్తం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.